# ఆర్థిక విధానాల తీరూతెన్నూ

**పోటీపరీక్షల్లో ఆర్థిక విధానాలూ, వాటి ప్రభావాల గురించి ప్రశ్నలు వస్తుంటాయి. వాటి మంచి చెడుల గురించి అధ్యయనం చేయటం అభ్యర్థులకు ఎంతో అవసరం. వర్తమాన పరిణామాలను అనుసంధానించి వీటిపై అవగాహన పెంచుకోవాలి!**

'రైతుల మీటింగంటే వెళ్లా. అక్కడ ప్రైవేటీకరణం, సరళీకరణం.. ఇంకేదో కరణం అంటూ ఒకటే చెప్పడం'- కొండల్రావు

'అవునవును. మీ రైతుల్ని ప్రపంచీకరణమే ఆదుకుంటుందనీ, ఇక చింత వద్దనీ మంత్రిగారు చెబుతుంటే నేనూ విన్నా'- రామారావు



నూతక్కి విజయశేఖర్
www.teluguvartalu.com

'ఈ కరణాలు ఈ మధ్యనే వచ్చాయా? ఎప్పటినుంచో ఉన్నాయా?'

'మనవాళ్లు రెండు మూడు దశాబ్దాలుగా మొదలుపెట్టారు గానీ, ఇవన్నీ ఎప్పుడూ ఉన్నవే. ఇందిరాగాంధీ కాలంలో నేతలకు జాతీయాకరణ ఊతపదం. వాటిని నెహ్రూవియన్ విధానాలు అనీ అనేవాళ్లు. వాటికి కాలం చెల్లిందని చెప్పి ఇప్పుడు సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల్ని అమలు చేస్తున్నామంటున్నారు' వివరించాడు రామారావు.


'మార్జాలం అంటే బిడాలం అని చెప్పినట్లుంది నీ వరస. సభలో చెప్పింది అర్థంకాక నీ దగ్గరికి వస్తే నువ్వు కూడా మళ్లీ అవే మాటలు చెబుతున్నావు'

'సరే విను. దేశంలో వనరులు, ఉత్పత్తి సాధనాలు/ శ్రమ సాధనాలు ప్రభుత్వ యాజమాన్యం నుంచి ప్రైవేటు యాజమాన్యానికీ/ ప్రైవేటు యాజమాన్యం నుంచి ప్రభుత్వ యాజమాన్యానికీ మార్చాలంటే ప్రభుత్వాలు అందుకు అనుగుణమైన విధానాలను చట్టసభల అనుమతితో అమలు చేయాలి. ప్రైవేటు నుంచి ప్రభుత్వ యాజమాన్యానికి బదలాయిస్తే అది జాతీయాకరణ (నేషనలైజేషన్). ప్రభుత్వ యాజమాన్యం నుంచి తప్పించి ప్రైవేటు వ్యక్తులకూ, గ్రూపులకూ అప్పగిస్తే అది ప్రైవేటీకరణ (ప్రైవేటైజేషన్)'.

'అయితే రాజధాని కోసం భూముల్ని ప్రభుత్వం తీసుకోవడాన్ని జాతీయాకరణ అనొచ్చా?'

'అలా చెప్పలేం. ప్రభుత్వం పాలనా అవసరం కోసం ఆ భూముల్ని తీసుకుంటోంది. ఉత్పత్తి కోసం కాదు. కొన్ని భూముల్ని అభివృద్ధి చేస్తారని చెప్పి ప్రైవేటు సంస్థలకు ఇస్తోంది. దీనికి పబ్లిక్- ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) అని పిలుస్తున్నారు.

ఇక బహుళజాతి సంస్థలు అంతర్జాతీయ సరిహద్దులకు అతీతంగా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పించేవి ప్రపంచీకరణ విధానాలు. కార్మికులూ, ఉద్యోగులూ కూడా పని కోసం స్వేచ్ఛగా దేశాలు తిరగొచ్చు అంటారు కానీ ఆచరణలో అది జరగడం లేదు. అనేక నిబంధనలు పెట్టి వీసా ఇవ్వకుండా పశ్చిమ దేశాలు ప్రజల వలసలను నిరోధిస్తున్నాయి'.



---

భూములు, గనులు, నీళ్లు, చమురు లాంటి ఉత్పాదక వనరులను దేశ ప్రజలకు ఉపయోగపెట్టడం ప్రభుత్వాల గమ్యం. ఇందుకోసం కొందరి పర్యవేక్షణలో శ్రామికులను సమీకరించి, వేతనాలు చెల్లించి, వాటిపైన శ్రమ చేయించాలి. అంటే సహజ వనరులను ఖర్చుపెట్టి ప్రజలకు అవసరమైన ఉత్పత్తులు తీయాలి. వ్యవసాయ భూములు, పరిశ్రమలు, ఆఫీసులు, రైలు-బస్సు-ఓడ రవాణా.. ఇవన్నీ ఉత్పత్తి సాధనాలు. ప్రజోపయోగకర, వినియోగ ఉత్పత్తులు తయారుచేసే ఉత్పత్తి సాధనాలు, వనరులు ఎవరి యాజమాన్యంలో ఉండాలన్నది ప్రభుత్వ విధానాలు నిర్ణయిస్తాయి.

ప్రభుత్వమే దేశ వనరులను తన స్వాధీనంలో ఉంచుకుని, ఫ్యాక్టరీలు స్థాపించి, ప్రజలకు ఉద్యోగాలు ఇచ్చి ఉత్పత్తులు తీస్తే అది ప్రభుత్వ యాజమాన్యం. అలా కాకుండా వనరులను కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు/ గ్రూపులకు అప్పజెప్పి, వారికి బ్యాంకు రుణాలు ఇప్పించి, వారి చేత ఉత్పత్తులు తీయిస్తే అది ప్రైవేటు యాజమాన్యం. ఈ రెండు పద్ధతులూ కలిసివుంటే అది మిశ్రమ యాజమాన్యం. 1947లో బ్రిటిష్ పాలకులు వెళ్లిపోయాక మిశ్రమ యాజమాన్యాన్ని/ మిశ్రమ ఆర్థిక వ్యవస్థను భారత్ ఎంచుకుంది. జాతీయాకరణ, ప్రైవేటీకరణ విధానాల ద్వారా వనరులు, ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యాన్ని ప్రభుత్వం బదలాయిస్తుంది.

ప్రైవేటు, ప్రభుత్వ యాజమాన్యాలు రెండూ ఉన్నప్పుడు ఏయే రంగాలు ఎవరు నిర్వహించాలన్న సమస్య వస్తుంది. ప్రైవేటు సంస్థలు ప్రజల అవసరాలు విస్మరించి తమ లాభం కోసమే వనరులను ఇష్టానుసారం ఖర్చుపెట్టే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలను నివారించటానికి ప్రభుత్వం కొన్ని నియంత్రణలు, నిబంధనలు, విభజనలు రూపొందించి అమలు చేస్తుంది. ఇవి సుంకాలు, అనుమతులు, లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు... మొదలైన రూపాల్లో ఉంటాయి. ప్రస్తుత ఎల్‌పీజీ (లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) యుగంలో ఈ నిబంధనలను తమ వ్యాపార స్వేచ్ఛకు అడ్డంకిగా ప్రైవేటు సంస్థలు భావిస్తున్నాయి. నియంత్రణలను సరళీకరించాలని కోరుతున్నాయి. ఉదాహరణకు ఒక ఔషధం ప్రభుత్వ సంస్థే ఉత్పత్తి చేయాలని నిబంధన విధించడం, రూపాయి పూర్తి మారకాన్ని నిరోధిస్తూ విదేశీ సంస్థలపై షరతు విధించడం, ఎగుమతి-దిగుమతి సుంకాలు విధించడం.. మొదలైనవాటిని ఎత్తివేసినా, పాక్షికంగా సడలించినా అవి సరళీకరణ (లిబరలైజేషన్)లో భాగం.

సాంకేతిక పరిజ్ఞానం ఊహించని స్థాయికి అభివృద్ధి చెందింది. గంటల వ్యవధిలో జనం దేశాలు దాటిపోతున్నారు. రోజుల వ్యవధిలో సరుకులు దేశాలు, సముద్రాలు దాటి ఇళ్లను చేరుతున్నాయి. వారాల వ్యవధిలో ప్రపంచాన్ని చుట్టి వచ్చేస్తున్నారు. నెలల వ్యవధిలో పౌరసత్వాలు మారుతున్నాయి. వివిధ రాజకీయ, వాణిజ్య కూటములను ఏర్పరచి వివిధ దేశాల గ్రూపులు ఉమ్మడి కరెన్సీలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచం కుగ్రామం అయిందనీ, అదే ప్రపంచీకరణ అనీ చెబుతున్నారు. ఇది పాక్షిక వాస్తవం. అసలు వాస్తవం బహుళజాతి సంస్థల వాణిజ్య ప్రయోజనాలకు సంబంధించినది.

జాతీయాకరణ, ప్రైవేటీకరణల్లో ఏది ప్రజలకు మంచిది అన్నది ఆయా దేశాలను చూస్తే తెలుస్తుంది. ప్రైవేటీకరణ విధానాలు అమలు చేస్తున్న అభివృద్ధి చెందిన దేశాలు (అమెరికా, ఐరోపా) ఇప్పుడు తీవ్ర ఆర్థిక అసమానతలతో సంక్షోభాల సుడిలో ఉన్నాయి. మిశ్రమ విధానాలు అవలంబిస్తున్న లాటిన్ అమెరికా దేశాలు సాపేక్షికంగా అసమానతలు తగ్గించుకుని ప్రజల విద్య, వైద్య అవసరాలు తీరుస్తున్నాయి. ఐ.రా.స. నివేదికలు దీన్నే చెబుతున్నాయి!